కథ :

# కుట్ర

కాళీపట్నం రామారావు

పట్నంలో ఏదో కేసౌతోందట—ఇన్నావా ? ఈ మధ్య మరదలు పెళ్ళి సంబరంలో పడి, నాలోజులు పేపర్లు సూళ్ళేదు.

మన పేడిశర్మలేడా ?— ఆడూ, ఆళ్ళ సీనియర్ దివోదాసూ మొన్న కోరుట్నుండొస్తూ దార్లో కనిపించేరు.

దగ్గిర దగ్గిర నూటేబై మంది ముద్దాయిల్ట ! వెయ్యిమంది సాచ్చిల్ట ! 'ఏటిదొమ్మీ కేసా ? అన్నాడు— నాతో తిరుగుతుంటాడు, బీమారావని, ఆయన. 'కాదు. కాన్స్పిరసీ' అన్నారు.

కాన్స్పిరసీ అనగానే నాకు నవ్వొచ్చింది— నవ్వుకాదా ?

కుట్రంటే, ఇద్దరో ముగ్గురో మధ్య రహస్యంగా జరిగితే అది కుట్ర. నూర్నూటేబై మంది జనంవేటి —ఆళ్ళ పక్షాన కారు, నీ పక్షాన పలకడానికొచ్చినోళ్ళే. వెయ్యి మంది సాక్షులు ! అంత సాక్షింతో జరిగిందీ అంటే అది పబ్లిగ్గా జరిగిందన్న మాట. అలాటిది ఏటేనాకావొచ్చుగాని, కుట్రమాత్రింకాదు. దాన్ని 'కుట్ర' అనడవే ఓ పెద్ద కుట్రంటాను. తిరుగుబాటనడానికి, నీకు నామోషీ ఏటీ ?

నేనామాటే అన్నాను.

'ఏవి సాంవీ ! మీ లా పుస్తకాల్లో కుట్రకీ తిరుగుబాటుకీ వేరే వేరే పదాల్లేవా ? ఉన్నా— ఇంగ్లీషోడి సాంవెత ఉందిగదా— ఉరిదీసీముందు ఓ చెడ్డపేరు ఎట్టమని— ఇది అ పద్ధతా ?' అన్నాను.

'కదు కాదు. లాఫుల్‌గా ఏర్పడ్డ గవర్నెంటుని కూల్దొయ్యటం, అందుకు ప్రయత్నించడం నేరంవే. ఆ ప్రయత్నం ఎందరుచేసినా, ఏ దేశంలోచేసినా, దాన్ని కుట్రనే అంటారు' అన్నాడు పేడిశర్మ.

సూసేవుకదూ— ఆ మాటలో ఇసురు— నేను జవాబిద్దా మనుకున్నాను. ఇంతలో మన కవికులతిలకుడు,

'ఏంవిటీ ? రాజ్యాలేకాదు— రాజులుకూడా మారడానికి వల్లకాదంటా రేమిటి ?' అన్నాడు శిష్టవ్యవహారికంలో.

మారొచ్చుట కాని ఆ మారడం చట్టసమ్మతమైన పద్ధతుల్లోనే జరగాల ! అలాగని కాన్‌స్టిట్యూషన్ మీదా— ఫండమెంటల్ రైట్సుమీదా సింకి లెక్చరు ఓపెన్ చేసేడు. మరింక సూసి లాభంలేదని అడిగీసేను.

'ఏటి గురూ ! కాన్‌స్టిట్యూషన్ రాసినోళ్ళుగాని, అంత ఎర్రికూపులేటి ?' అన్నాను.

దెబ్బతో పేడిమూతికి నోరు షటాఫ్ అయిపోయింది. దివోదాసుగారు మన దేవభాషకు తట్టుకోలేక, వక్కపొడి నెపముతో, పక్క కిళ్ళీకొట్టుకు జారుకున్నాడు.

అవును గురూ రాజ్యాంగాలు రాసినోళ్ళు ఎందుకని రాస్తారు ?

—ఇప్పుడు నువ్వే వున్నావు. ఓ కోఆపరేటివ్ సొసైటియో, ఓ హౌసింగ్ స్కీమో, అందాకా ఎందుకూ. ఓ కల్చరల్ క్లబ్బే యెడదామనుకున్నావు.

—ఎందు కనుకుంటావు ?

నీకేదో ఓ ఉద్దేశం ఉండాల—

నువు బాగుపడదాంవనో, నీ సుట్టాలు పక్కాలు— నీ స్నేహితుల్ని పైకిలాగుదాంవనో, అల్లాడు ఫలానా ఘనకార్యం చేసేస్తున్నాడు— దాన్ని మీరిపోవాలనో, ఏదో— వుంటాది. కాదు. ప్యూరు దేశసేవే అన్నా— ఆ సేవకూ్కడా నీ కులంవనో ఫలానా కులంవనో, కార్మికులూ, కర్షకులూ, పీడిత మాజీసంస్థానాధీశులూ— యిలాటి లిమిటేషను ఏదో ఒకటుంటాది. లిమిటేషన్లులేని సంఘాలుండవు. నువు బయటికిచెప్పొచ్చు? చెప్పపోవచ్చు; కాని లిమిటేషన్లు ఉండితీరతాయి.

ఏ ఉద్దేశంతో నువ్ మొదలెట్టినా— అది సాగాలంటే, అలాటి ఉద్దేశంవేగల మరికొందరి అండదండలు నీక్కావాల. అండదండ లుండాలి, కాని— ఆడు తొలీ, నువు ఎనకా అయిపోకూడదు. ఆడు నీ లీడరుషిప్పు అంగీకరించి, నువ్వు చెయ్యదలచిన పనంతా చేసిపెట్టాలి.

అలాటప్పుడు నీ 'బై లా'లు ఎలాగుంటాయీ ?

—ఏ రూల్సు లేపోతే నీకిబ్బందై, ఏ రూల్సు పెడితే నీ కాబోయే ప్రత్యర్థులికి కాళ్ళూ సేతులూ ఆడవో అలాటి రూల్సే అన్నీ యెతికెతికి రాస్తా579

మాటవరసకి—'ఎనీ సిటిజన్ ఆఫ్ దిస్ టౌన్...'అంటూనే'...ఎ డామిసైల్ ఫరెట్లీస్ట్ ట్వెంటీ యియ్యర్స్' అంటావు. ఆ క్లాజు తగిలించడం వెందుకు? మనం పాతికేళ్ళక్రితం యీ వూళ్ళోకిలేంవు, దిగి యిరవైయేళ్ళ పైనయ్యింది—అందుకు.

'బైలా'లకీ ఏ ఎమెండ్మెంటేనా తెచ్చినా ఇలాగే—

'మాబు' మన పక్షానుంటారంటే, నువ్వా వయోజన ఓటూ డెమాక్రసీ అంటావు. మన పోలసీని 'మాబు' నచ్చుకోలేదని రూఢీగా తెలిసిపోద్దనుకో—అప్పుడు ఆ డెమాక్రసీనే ఆ నోటితోనే మాబక్రసీ అని తిడతావు — అది ఎర్రి కుట్టెల పని.

అలాక్కాదు. నిన్నటెలక్షన్లలో—ముదరోళ్ళు మునపట్లా మనకి ఓట్లెయ్యడం లేదని తెలిసిందనుకో — అయితే ఎవరేస్తున్నారు? యువజనులే కసింతలో కిసింత మనకేసి మొగ్గుతున్నారు. అయితే ఓటేసే వయసు పద్దెనిమిదేళ్ళకు దించీమనాల!

అదీ ఎత్తుగడ.

నువ్వేం చేసినా — లిబరల్‌గా ఉన్నట్టు కనపడాల. దానివల్ల అవతలోడు బలహీనంపైపోయి అదే సమయంలో నువు మెరిగీ గలగాల. కీలకస్థానాల్లో నీ కిష్టంకాని మనుషులు దూరాల్లిదు. దూరినా ఆర్గనైజేషను ఆళ్ళిష్టంవొచ్చినట్టు నడవరాదు — అది నీ ప్రధానలక్ష్యము. ఆఫీసు రన్నింగు దగ్గిర్నుండీ, అన్ని వ్యవహారములూ ఆ 'గోలు'కే సాగుతాయి.

నీకే ఇంతింతలేసి ఊహాలుంటే, మరాళ్లు ఒక్కొక్కడూ ముక్కోటి కాన్‌స్టిట్యూషన్లూ తిరగేసి బోర్లించి యీకకీ యీకా తోక్కీతోకా పీకేసి అసలు పదార్థమంతా జీర్ణించుకున్నోళ్ళట. ఎలాటెలాటి ఆర్టికల్సులో ఎలాటి బొక్కలుంటాయో, దేని దేని ఉచ్చు లెంతెంత గట్టియో, రాసిన రాజ్యాంగం మీదికి దాడి జరక్కుండా ఉండాలంటే మేకు బందీలు ఎక్కడెక్కడ ఎలా కొట్టాలో, అయన్నీ తెలీకండానే, సూడకండానే, రాయించుకుంటారేటి— నాకు తెలీకడుగుతాను.

'చట్టసమ్మతంగా' అని నువ్వు పెట్టిన షరతే చెపుతుంది— దాని ప్రకారం వడిస్తే దాన్ని మార్చలేవంని.

మరి నువ్వలాగ, అంతకంతల్లేని గదిలో కాపరంపెట్టి, ఉన్న ఒక్క గుమ్మానికి మంచం అడ్డేస్తే, ఆ కాపరం చక్కబెట్టదలిచినోడికి రెండే రెండుదార్లు. నిశిరాత్రి నీపీక పిసికేడం మొదటిది— లేదా గోడలు బద్దలుకొట్టేయాల!— మూడోదారి, మరిలేదు.

హిరణ్యకశిపుణ్ని అంత ఘోరంగా ప్రెజెంట్‌గాచంపడం బాగాలేదన్నాట్ట ఎవడో. ఆడు కోరిన వరాలెలాంటివి అన్నాట్ట విష్ణుప్రియుడు.

మోడర్న్ హిరణ్యకశిపులూ అంతే— తక్కువ తిన్నారేటి ? కాన్స్టిట్యూషన్ ఆళ్ళకి కావలసినట్టు రాయించుకుని. ఈ కసిన్ని సంవత్సరాల్లోనే లక్షాధికార్లు కోటీశ్వర్లూ, కోటీశ్వర్లు మల్టీమిలీనీర్లూ, అయిపోయి— ఇంకా నిచ్చెన్లెత్తేస్తున్నారు. అందికే ప్రజలు ఉగ్రనారసింహులు కావలసొచ్చింది. లేపోతే భారతదేశ చరిత్రలో ఎక్కడేనా ఎరుగుదుంటా— లిటరేచరుగాని హిస్టరీగాని తిరగేసూచ్చడండి.

నన్నడిగితే, కుట్రనదగ్గది ఏదన్నాజరిగితే రాజ్యాంగం రాసినప్పుడే జరిగుండాల. పంచవర్ష ప్రణాళికలు ఏసిన్నాడు డెఫినెట్‌గా జరిగింది. జరిగిందనడానికి దాఖలా లున్నాయి.

అసలు కుట్ర అది. అది దుంప, ఇయన్నీ దాన్లోనుండి ఒచ్చిన పిలకలు. సమాజికవ్యవస్థ అనే బాడీలో ఇషక్రిమిని ప్రవేశపెట్టేవు. వీక్ బాడీయే అయినా ఇంకా రోగనిరోధకశక్తి మిగిలుంది, సంతోషించి సాయం చెయ్యడానికి బదులు రెసిస్టెన్సు చంపడానికా వైద్యం !

కుట్రన్నదేదేనా జరిగితే ప్లానేసినప్పుడే జరిగింది— అన్నానా ? ఆ ప్లాన్లెలాగ ఏసేరో చెపతాను. అది కుట్ర అవునో కాదో, కాపోతే నీ భాషలో దాన్నేమంటారో, నువ్వే చెప్పు.

'పి పి వైద్యనాథం !' అన్న పేరు ఎప్పుడేనా విన్నావా ? ఆడెంతటోడో నానా కాలం నాకూ తెలీదు. సెంట్రల్లో ఎడ్యుకేషన్ మినిస్ట్రీ చేసేడనే అనుకున్నాను. కాని ప్లానింగ్ కమీషన్లో టూ కాన్సిక్యూటివ్ టెరమ్స్ మెంబరట.

నైన్టీన్ హండ్రెడ్ సెవెంటీలో కావాల నెల నాకు సరీగా గుర్తులేదు. టైమ్ మేగజీన్ తిరగేస్తుంటే— ఆడి ఫోటో, పక్కని ఇంతింత అక్షరాల్తో ఆడి పేరు.

ఏటిగడా అని సూద్దునూ— ఆడిమీద రెండున్నర కోలాలు వ్యాసవు. టైమ్మేగజీన్లో ఓ యిండియన్ గురించి— అప్పటికీడు పవర్లోలేడు. అంత రాయడమంటే మాటలేటి ? అయితే గట్టోడే అనుకున్నాను. అప్పట్నుండి ఆడిమీద అలాగ ఓ కన్నేసి వుంచేను.

సౌత్ సెంట్రల్ ఇండియాలో ప్రొడక్షనూ, మార్కెటింగ్, మొత్తం ఇండస్ట్రియల్ నెట్ వర్కంతా ఆడి గుప్పెట్లో ఉంటాయట. "సౌదిండియా మార్కెట్లో సరుకు

దించాలన్నా ఎత్తాలన్నా ఆడు అరిచెయ్యి తెరిస్తే కద్దూ లేపోతేలేదూ అన్నట్టు రాసేడు ఆ కోలమిస్టే.

మనకి యితరత్రా అందిన బోగట్టా ఏటంటే. ఇండిపెండెన్సు రాకముందు ఆడూ హాఫెనీ టఫెనీ ఇండస్ట్రియలిస్టే. కాపోతే స్వారాజ్జా పైపు. ఐసియస్ చెయ్యడానికి లండనెళ్లాడు. అక్కడ దొరల్తోపడక, ఇంటికొచ్చేసి, నలుగురైదుగురు చెట్టియార్లతో మార్వాడీల్తోనో రెండో మూడో కంపెనీ లెట్టించాడు. 'స్వదేశీ వస్తువులనే కొనండి' అంటూ చిన్న చిన్న వ్యాసాల్తో ఆరంభించి, ఇండియన్ ఎకనామిక్సుమీద పుస్తకాలు రాసిందాకా ఎదిగేడు.

ఈ యిరవై, యిరవై రెండేళ్ళలోనే, చీరపేను పేడ పురుగై అక్కణ్ణుండి అది ఛెంటికల్సు పెంచేసినట్టు ఆక్టోపస్ లెవిల్‌కి పెరిగిపోయేడు.

ఇప్పుడు సొత్న వంద కంపినీలున్నాయంటే, అందులో తొంబై యింటనేనా ఆడికీ వాటాలుంటాయి. లేపోతే ఆడు పార్టునరేనా అవుతాడు. ఆడు కాపోతే ఆడి బామ్మరిది, ఆడి మేనత్త, మేనమాంవ పెళ్ళం, ఆడి తమ్ముడి కొడుకు— ఎవడో ఒకడు— ఆడి మనిషంటూ ఒకడు కీలకస్థానంలో ఉండిలీరుతాడు.

మా ఫ్రెండ్ అంటాడు—

స్టేట్ ఎకనామిక్సు'కీ బోర్డు ఎక్కడెక్కడని కేపిటల్లో ఎతికితే దొరకదు. తిరుచ్చో తిరునల్వేలో, ఆడి హెడ్డాఫీసు. ఆ ఆఫీసు టేబిల్ దొంగ సొరుగు లాగితే అందులో దొరకడం ఖాయం— అంటాడు. అతిశయోక్తి కావచ్చు— అంతపాటి మనిషంటే ఒప్పుకోవొచ్చు.

'హీ యీజ్ ది విజార్డ్ ఆఫ్ సౌదిండియా టాంబరా కామర్స్' అని ఆ టైమ్ కాలమిష్టు సర్టిఫికేట్ ఇచ్చేడు. ఒట్టినే ఇచ్చుండడు.

ఆడి గురించి యిన్నకొద్దీ ఈర్ష్యా, కోపమూ వంటి 'యిల్‌ఫీలింగ్స్' యింతలా పుడతాయో ఆడంటే వెనరేషన్, 'ఎ నేవ్‌నమ్ వెనరేషన్' అంతకు పదింతలు పుడతాది.

అయితే కొందరేటంటారంటే, డాకూలికి తప్ప అలాటి డాకూలపట్ల గౌరవం కలగదంటారు.

సరే నా మాటబొదిలీ ఆ డాకూవే అయితే, లైఫ్‌లో ఆడు సాదించిన విజయం లేదు ?

ఫస్టు క్లాస్సెంటర్లో నువ్వెంచుకున్న బిల్డింగ్ అద్దెకిప్పిస్తాను, నువ్వెంత కావాలంటే అంత మదుపు ఏర్పాటు చేస్తాను. నీ యిష్టంవొచ్చిన బిజినెస్ నువ్వెంచుకో.

582

ఐదేళ్ళ గడువు. గడువు చివరకి నా అసలు నాకప్పగించు. నువ్వు దివాలాతీసి నన్ను కూడా ముంచీపోతే, నా చెవు కదపాయిస్తాను.

కబుర్లు యీజీగా చెప్పేవొచ్చు. ఏవుంది తోలు నాలిక ! ఎలాక్కావాలంటే అలాగే తిరుగుతాది.

ఆడు డాకూ అయ్యేడంటే అయ్యేడు. ఎలాగయ్యేడు మిగతావోళ్ళు చేస్తే, కానిస్తే అయ్యేడు. అంత మాత్రంచేత అడి కార్యదక్షతకీ, ఆడిజీనియస్సుకీ విలువ లేకండా పోతాదేటి ?

తెలివితేటలుండడ(వే తప్పుగా ఎంచుతారు కొందరు. తెలివితేటలుండడంతప్పు కాదు. అవి మంచికి కాకుండా, జనంకి కాకుండా, చెడ్డకి ఉపయోగపడ్డం తప్పంటే కావొచ్చు. అయితే అందుకు ఆడిదెంత బాధ్యతో, జనాల్దీ అంతే బాధ్యత.

ఒక పాలి, మన దేశవాళీ పొలిటీషియన్ ఒకాయన, మనోడిగురించి ఏదో అన బోతే, నేనిలాగే అన్నాను.

'అవును గురూ' మనకి నేషనల్ ప్రైడ్ తక్కువ. ఆడు డాకూవే అగుగాక- అయితే ఎందుకయ్యేడు ? ఎలాగయ్యేడు ? ఈ దేశంలో యీ వ్యవస్తలో పడకండా మరింకో వ్యవస్తవున్న యింకో దేశంలో పుట్టుంటే ఆడే(వవును ?

'...అప్పుడూ ఇంతే అవునూ'

'—అయితే ఇక సాలు, ఊరుకో' అనీసేను.

అవునంటీ కనుదృష్టి లేనోళ్ళకి కళ్ళివ్వగలం. ఉండి కళ్ళు మూసుకునోళ్ళకేం చెయ్యగలం ?

నేననేది— మన్దేశంలో కొందరు నకిలీ మహాత్ములో ఒక నిజం మహాత్ముడో, పుట్టేరంటే పుట్టే అవకాశం ఉంది. ఎంచేతంటే, మన్ది మొదట్నుండీ స్పిరిట్యువల్ కంట్రీ కాబట్టి.

అలాగే అక్కడో అరా, ఇక్కడో పాతికా, రామన్లూ టాగూర్లూ పుట్టినా పుట్టొచ్చు—సైంటిఫిక్ ఫీల్డులోనూ లిటరరీఫీల్డులోనూ మనకుండుకున్న వారసత్వాన్నిబట్టి.

కాని—

వరల్డ్సు ప్రిమిటివ్ ఎకానమిల్లో ప్రిమిటివెస్టు ఎకానమీ— బియ్యం(విచ్చి కరేపాకు కొనుక్కొనే పద్ధతి— ఇప్పటికీ అమల్లోవున్న దేశం, మనది.

—ఇలాటి దేశంలో, అంతలావు ఇండస్ట్రియలిస్ట్-కమ్-ఎకనమిస్టు; పుట్టడ( వంటే, ఏటి అంత సప్పరించీదగ్గ సంగతా? 'చరిత్రి నేసిన మనిషి'ని తీసి పారీదలుచు కుంటే తీసి పారీ, కాని ఆలా నెయ్యిడానికేనా నెయ్యబడ్డానికేనా కొంచ[illegible]టలుండాలి.

అది కానరు— మన క్రిటిక్కులు!

అయితే ఆడి మెటలు మనలాటోళ్లు గుర్తిస్తే ఎంత, గుర్తించకపోతే ఎంత?— మహామహా నాయకులకే దాన్ని గుర్తించక తప్పలేదు.

దేశానికి పొలిటికల్ ఫ్రీడం వొచ్చిన తదుపరి ఎకనామిక్ ఫ్రీడం సాధించడానికి ప్లాన్లు కావలసొచ్చేయి. 'కేపిటలిస్టు ఎకానమీయా, సోషలిస్టు ఎకానమీయా?' అని దేశంలో రైట్లూ లెఫ్టులూ ఊఁకొట్టేసుకుంటుంటే, ఈడు మిక్స్‌డెకానమీ అని ఓ కొత్త థీరీ పట్టుకొచ్చేడు.

కొత్తంటే కొత్తకాదూ. ఆ పేరే కొత్త— ఆ దారి అంతకు ముందు యూరపు కంట్రీస్ తొక్కిందే. ఇప్పుడా బ్రిటననగా, ఫ్రాన్సనగా— ఏయే దేశాల్లో అయితే. వర్కింగ్ క్లాస్ కొంత తెలివి తెచ్చుకొని సోషలిజం కావాలంటుందో, ఆయా దేశాలన్నిట్లోనూ మసి బూసి మారేడుకాయ చేసే విద్య కొత్తదికాదు. ఈడు దాన్నే బాగా స్టడీ చేసి, మిక్స్‌డెకానమీ అన్నాడు. ఆ పేరేనా యీ డెట్టిందో. లేపోతే అదీ పాద్దేనో, నా కనుమానవే

అయితే పవర్లో ఉన్న నాయకులకది బాగా సూటయ్యింది. అంచేత ఆళ్ళీణ్ణి పట్టేసేరు,

'నువ్వొచ్చి మా ప్లానింగ్ కమీషన్లో ఉండు'— అంటే ఆడిచ్చిన జవాబేటో తెలుసా?

'నేను మీ పార్టీ మెంబర్నికాను. ఒకేళ మీరు నన్ను చేసినా, నాకెప్పుడిష్టం లేపోతే అప్పుడు బయటకి నడిచేస్తాను. మీరు కాదనడానికి ఒల్లకాదు.' అన్నాడు.

దానికొప్పుకుంటే యింకో షరతు—

ప్లానింగ్ కమీషన్‌లో మెజారిటీమీది. ఒక పాలి మిమ్మల్నొప్పించి మీ చేత ఔననిపించిన పథకం, అది యెంత కష్టమైనా కానీ, అమలు చెయ్యడం మీ ధర్మం. అందుకెన్ని అటంకాలు వచ్చినా, మేం దాన్ని అమలుచేసి తీరుతాం— అని, కనీసం మీ అగ్రనాయకులు, పెద్దమనిషి తరహా హామీ యివ్వాలన్నాడు.

ఆడెన్ని షరతులెడితే అన్నిటికీ ఒప్పుకొని, అధికారంలోవున్న నాయకత్వం ఆణ్ణి కమీషన్‌లోకి తీసుకుంది.

అవునండీ— మరేం చేస్తారూ—

గాంధీగారూ, తమ కేడర్ని ఖద్దరొడకమన్నాడు. ఎత్తే జైళ్ళకెళ్ళమన్నాడు. అంతేగాని ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్‌లాటి సమస్యల మీద పుస్తక పరిజ్ఞానమేనా సంపాదించమన్నాడా?

నాకు తెలిసినంతవరకూ, మన స్వతంత్ర్య యోధులందరూ, హిస్టరీల్చదివి (ఆటో)బయాగ్రఫీలు రాసుకున్నారు. ఎందుకు? చరిత్రలో కెక్కిపోడానికి. కొందరు కొందరు భగవద్గీతలకి వ్యాఖ్యానాలు రాసేరు. అంతేకాని, స్వాతంత్ర్యం ఒస్తే, రేపు మన దేశం కేం కావాల? మనఁవేం చెయ్యగలం? అన్న ఆలోచన ఒక్కనాకొడుక్కైనా ఉండీదంటారా—ఎవళ్లో ఒకళ్ళిద్దరు ఉన్నారంటే లెక్కలోకిరారు.

అందికే ఆ రొజొచ్చీసరికి, రాజ్యాంగం రాయడం కాణ్ణుండి, ప్లాన్లెయ్యడం కాణ్ణుండి— ప్రభుత్వ యంత్రాంగం నడిపించడానికి సరేసరి— అన్నిటికీ 'నాన్‌పార్టీ' మెంబర్లమీదా, కొందొకచో జస్టిస్‌పార్టీలాటి ఘోరమైఁన పార్టీసభ్యులమీదా ఆధారపడ వలసొచ్చింది. ఆళ్ళు, 'ప్రజారాజ్యం' 'రామరాజ్యం' అంటూనే దీన్ని రాక్షసరాజ్యం చేసీసేరు.

ఈ వైద్యనాధంకూడా అలాటోళ్ళలో ఒకడైతే ఆడి తప్పు ఏఁవుందీ ?

ఈడు సోషలిస్టు ప్రణాళిక, సోషలిస్టు ప్రణాళిక, అంటూనే రెండు శ్లోషలిస్టు ప్రణాళికలు తయారుచేసీసి, పార్లమెంటుచేత ముద్దర్లు గుద్దించీసేడు.

ఆడేసిన ట్రిక్కేటో తెలుసా ? మనకి కేపిటలిస్టు ఏకానమీ వద్దు. సోషలిస్టు ఎకానమి అంతకన్నా వద్దు— అన్నాడు. మొదట్నుండీ మన ఆలోచనా విధానమును నాయకులు తీర్చిదిద్దిన తీరే అంతగదా ?

బ్రిటిషువారు మన మిత్రులా ? కాదు కాదు— అయితే శత్రువులా ? అబ్బబ్బే ఎంతమాత్రం కాదు.

హిందూ మతాచారాలు మంచివా చెడ్డవా ? చెడ్డవే చెడ్డవే. కాని అందులో మూఢాచారాలు తొలిగించేస్తే, మొత్తం ప్రపంచంమీద దీన్ని మించింది లేదు.

ఇప్పుడు మనం పండిత భాష నుద్ధరింపవలెనా ? జనసామాన్యం వాడుకునే భాష సరిపోతుందా ? అదీ కాదు, ఇదీ కాదు— శిష్ట వ్యవహారికంటే శ్రేష్టంబు—

—ఈ నేషనల్ సైకాలజీని ఆడు ఈజీగా పట్టీసేడు, పట్టీసి 'రైట్టర్నా, లెఫ్ట్ టర్నా' అన్న డైలమాకాడ, మనది మయామీడియా— అంటే తిన్నగా పాతదారికే— అని, జనాల్ని బొంబాయి ప్లానుకి పట్టించీసేడు.

బొంబాయి ప్లానంటే— పందొమ్మిదివందల ముప్పైల్లో కావాల, బోసుబాబూ, మరింకో ఇద్దరు ముగ్గురు నేషనల్లీడర్లూ, ఓ నేషనల్ ప్లాను తయారు చేసేరు. చేస్తే దానికి ప్రత్యామ్నాయంగా దేశంలో కోటీశ్వర్లంతా ఏకఁమై, ఆళ్ళ తా[illegible] ప్లాను,

585

ఆళ్ళు తయారుచేసేరు. అదిగదే బొంబాయి ప్లాను. అయితే, ఆ ప్లాను పేరు ఎక్కడా చెప్పడు.

చూశా— మాంసం పేలాటబుల్‌గా ఉండడానికి, ఇటోటి అటోటి చిన్న బ్రెడ్ స్లయిసులు, తగిలించి సాండ్‌విచ్ తయారుచేస్తారూ, అలాగ పందొమ్మిది వందల ముప్పై ఎనిమిదిలో, రాయిస్టులు తయారుచేసిన పీపుల్సు ప్లాన్నుండి ఓ ముక్కా (సారీ, ఇందాక నేషనల్ ప్లానన్నాను) యస్సెన్ అగర్వాలా మార్కు గాంధియన్ ప్లాన్నుండి ఓ తుంపూ తీసి, ఇందాక చెప్పిన బొంబాయి ప్లానుకి యిటూ అటూ తగిలించేడు. తగిలించి పార్లమెంటు ముందుకు ప్రవేశపెట్టేడు

"ఏటయ్యా యీ డిష్షూ?" అంటే... మిక్సెడెకానమీ అన్నాడు.

మిక్సెడెకానమీ అంటే ఏటో, అసలు ఎకానమీ అన్న మాటకి అర్థం ఏటో, ఎంత మందికి ఎరికా? మహామహా చదువుకున్నోళ్ళకే, దాని ఇరక బొక్కలన్నీ బోధపడవు. దానికితోడు మంది మన నాయకులకి తెలుసుకోవలసిన అవసరంలేదు.

అంచేత 'అలవాటీవాజు' ప్రకారం, అధిక సంఖ్యాకపార్టీ యస్సన్నలందరూ, అగ్రనాయకుల మొకాలు సూసేరు. ఆళ్ళు ఫరవాలేదు కానిచ్చేయండన్నారు.

రెండు కోర్సులు పూర్తిచేసి, మూడో కోర్సు కొచ్చేక—గాని, తము పుచ్చుకున్న ఫలహారం పచ్చిమాంసమని— అందులోనూ నరమాంసమనీ, కొందరు కొందరు అహింసామూర్తులు తెలుసుకోలేపోయేరు.

అప్పుడు 'ఏంవిటీ ఘోరకలి!' అని మొహం చిట్లించుకుని ఆర్చే సరికి, అసలు మనిషి ప్లానింగ్ కమీషన్ ఒదిలీసి విద్యాపీఠంమీద ఉన్నాడు. కసిపట్టలేక ఆ పోర్టిఫోలియోమీదే దాడిచేస్తే, మీ మంత్రిపదవి మీకాడే ఉంచుకోండని, బయటికొచ్చీసేడు.

అయితే—

ఇది ఘోరకలే అనీ, మొత్తం ప్లాను బొంబాయి ప్లాన్ని సీరీలైజు చేస్తున్నాయనీన్నీ, అప్పుడుకూడా నెత్తీనోరూ కొట్టుకున్నోళ్ళు లేకపోలేదు. కొట్టుకుంటే ఇనీవోడెవడు! అపోజిషన్ మెంబర్లలో సహితం, సగానికిపైగా, పెద్దపెట్టుబడికో చిన్నపెట్టుబడికో ప్రచ్ఛన్న సేవకులు, లేదా స్వయం సేవకులు. మిగిలిన జనాభాలో మూడొంతుల ముప్పాతిక మంది లేండ్‌లార్డులు. మొదటి ప్లాన్లో వ్యవసాయ రంగం మీద స్ట్రెస్ అనీసరికి, బయటికేంవన్నా ఆళ్లా లోపల్లోపల సంకలు గుద్దేసుకుంటున్నారు. మరిపట్టించుకునే దాతెవడూ? అంచేత, ఆళ్ళ సొదగాల్లో కలసిపోయింది.

ఆడు మొదటి ప్లాన్, 'ఎగ్రికల్చరుకి ఫస్టు ప్రిఫరెన్సు' అంటూ ఎత్తుకున్నాడు. ఎందుకెత్తుకున్నాడూ? వ్యావసాయక ఉత్పత్తులు పెరిగితేగాని, ఇండస్ట్రీకి [illegible]

లేదు. అందుకు వాట్ని పెంచాలన్నాడు. అంతేగాని, వ్యవసాయదార్ల మీద అభిమానం చేతగాదు, ఆహార సమస్య సాధించడానికీకాదు. ఒకేళ ఆ రెండూ జరిగితే ఆటిని 'బై ప్రొడక్ట్సు'అనాల. పత్రికలూ నాయకులూ మనకి ఇంకోలాచెప్పి ఉండొచ్చు. నిజాన్ని ఆడు డంకా బజాయించి చెప్తున్నాడు.

ఇంక రెండో ప్లాను సంగతి—

దీనికేసిన ఎరలు అంతకన్నా నోరూరించీవి!

"పర్జిజలంటే ఎవరు?" "పేదజనం"

పేదజనుల లాటు బాగుపడాలంటే ఏం చెయ్యాల? దేశంలో ఎంప్లాయిమెంటు పెరగాల.

'చిన్నవీ పెద్దవీ ఇండస్ట్రీలు పెడితేగాని ఎంప్లాయిమెంటు పెరుగుతుందా?' 'పెరగదు.'

'బడుగు దేశాల్లో— పరిశ్రిమల అభివృద్ధికుండే పెద్ద ఆటంకం ఇన్‌ఫ్రాస్ట్రిక్చర్ బిల్డింగ్— యంత్రాలు పై దేశాల్నుండి తెప్పించుకుంటే ఖర్చు పాపం పెరిగినట్టు పెరిగి పోతుంది—' 'ఔను పెరిగిపోతుంది.'

'పైగా కష్టపడి సంపాదించిన రాజకీయ స్వాతంత్ర్యాన్ని గెద్దల్తన్నుకు పోయి నట్టు— పెట్టుబడిదారీ దేశాలు తన్నుకుపోయినా తన్నుకుపోవచ్చు—' 'ఆ అవకాశం ఎప్పుడూ వుంది.'

'అంచేత, చిన్నవీ పెద్దవీ, భారీవీ భారంవీ— శ్రమ అనుకోకుండా అన్నిరకాల పరిశ్రిమలూ టేకప్ చెయ్యవలసిందే.' 'చెయ్యవలసిందే'

'అయితే—'

పెట్టాలన్న కోరికున్నంత మాత్రాన పరిశ్రిమలు పెట్టీగలవాఁ?'— 'పెట్టలేం పెట్టలేం.'

'అందుకేఁటేటి కావాలా? దేశంలో ముడిసరుకులు కావాల. మదుపులకి డబ్బు కావాల! పనిచేసే మనుషులుకావాల. వాళ్ళచేత బాధ్యతగా పనిచేయించగల, పరిశ్రి మల్లో అనుభవమున్న మనుషులుకావాల'. 'నిజఁవే నిజఁవే ఇవన్నీ ఉండవలసిందే.'

'ఇందులో మొదటి మూడూ మీ చేతిలో ఉన్నట్టే. లేపోఁయినా సంపాదించ గలరు. దేశవాళీ పారిశ్రామికుల సహకారం దొరకడవేఁ కష్టం.' 'ఏరా? ఎందుచేత?'

—అన్నీ జాతీయం చేసేస్తాం అని ఆళ్ళని ముందునుండే బెదరగొట్టేస్తున్నారు. అందాకా, కొంచెం, 'అయితే యీ దేశంలో మాకూ బతకడానికి అవకాశం ఉందన్న మాట' అనే ఆశ, నమ్మిక పుట్టించండి'— 'పుట్టిస్తే?'

587

ఇక్కడ్నుండీ ఆడి మిక్స్‌డెకానమీం టీకాతాత్పర్యం చెప్పుకొచ్చేడు.

ఇప్పుడున్న పెట్టుబడిదార్లని— ఎక్కడున్నోళ్ళ నక్కడ, ఎలాగున్నోళ్ళని అలాగే ఉండనియ్యాల. అప్పుడు దేశంలో ధనవంతునికి పొటన్షియల్ పెట్టుబడిదార్లకి పరవాలేదని నిబ్బరం కలుగుతాది. ఇప్పుడు మనం నష్టపరిహారా లిస్తాంవా? అవన్నీ యీ దేశం పెట్టుబడిలోనే చేర్తాయి. అలా కాపోతే, దేశంలో ధనవంతుల్డబ్బు, భూగర్భాల్లోకి దాగోడానికి పోతాది. లేదా యితర దేశాలకి పరారీ అవుతాది. ఏది జరిగినా మనకు నష్టంవే. ఒక్క ప్రజల్దగ్గర్నుండే తియ్యాలంటే ఏపాటొస్తది? ఎద్దు కెద్దు కలిస్తే జోడౌతాది. అన్ని వర్గాల్నుండీ పెట్టుబడి ఆకర్షింపబడాల. అందుకు మొర్తం పెట్టుబడిని రెండు సెక్టార్లు అందాంవు—

ఇందులోఒకటి పబ్లిక్ సెక్టారు. ఈ రంగంలో పెట్టుబడి ప్రజల్ది రెండోసెక్టార్లో పెట్టుబడి ప్రైవేటు జనాల్ది. ఇప్పుడున్నదికాక, కొత్తగా రాదలచినదాన్ని కూడా, ఆ విధంగా అందులోకే లాగాల. రెండింటికీ క్లాషు రాకుండా, ఒకదానిమీదొకటి కాంపిటీషనుకు దిగి రెండూ మసైపోకుండా, దాన్నిదీ దీన్నదీ సప్లిమెంటుచేసే పద్ధతిలో, రెండూ ఆరోగ్యంగా పెరగడానికి చాన్సిస్తూ, కొన్ని కొన్ని పరిశ్రిమలు ప్రైవేటు సెక్టారికి కేటాయించేసి మిగిలినవన్నీ పబ్లిక్ సెక్టారు నడుపుతే అలాక్కొంతకాలంజరగనిస్తే, మొత్తం రిసోర్సెస్ అన్నీ ప్రొడక్షన్ ఏక్టివిటీలోపడి, ఏభై ఏళ్ళలో అభివృద్ధి చెందవలసిన ఎకానమీ, పాతికేళ్ళలోనే మూడు పువ్వులూ ఆరుకాయలూ, అవుతుంది—!

ఇదీ—నా ప్లానన్నాడు.

సోషలిజం మా ధ్యేయం అంటూ మళ్ళా ప్రైవేటు కేపిటల్‌ను ఎందుకురా పెంచడం అంటే—

ప్రభుత్వమా కొత్తది, పూరా స్థిరపడలేదు. అనుభవమా పూజ్యం. పనిప్రారంభించేకగాని మన పనేమిటో తెలీదుకదా! మొత్తం ఇండస్ట్రీనంతట్నీ పబ్లిక్ సెక్టారే మేనేజ్ చెయ్యగలస్థితి వస్తే, కానియ్యండీ, ప్రైవేట్ పరిశ్రిమలు ఎక్కడికిపోతాయీ? ఎంత తిన్నా వాటిమీద ఆదాయం తినగలరుగాని ఒకసారి కొని పెట్టిన యంత్రాలూ గింత్రాలూ తినీలేరుగదా—యజమానులు, అప్పుడాట్నే లాగేసుకోవచ్చు—అన్నాడు.

లాజిక్ బాగుందికదూ—

సరే—అయితే ఏయేయే పరిశ్రిమలు పబ్లిక్ సెక్టారుంచుకోవాల. ఏవిప్రైవేట్‌కి ఒదలాల?

అన్ని రకాల భారి పరిశ్రిమలూ—వాట్నే హెవీ ఇండస్ట్రీస్ అంటారు, ప్రభుత్వం చేపట్టి! భారీ పరిశ్రమలు కొన్నీ, పంచదార బట్టలూలాటి (చిల్లర శివాలక్షలు) సామాన్య పరిశ్రిమలు పూరా, ప్రైవేటు కొదిలీడం సబబు అన్నాడు.

588

ఇక్కడకొచ్చేసరికీ, పిల్లి, ఇలాగ, తల బైట పెట్టడం కనపడతాది చూసి నోడికి.

భారీ పరిశ్రమలంటే మీరు ఇనేవుంటారు. ఇనుము ఉక్కు తయారీ, చిన్న పరిశ్రమలకూ పెద్ద పరిశ్రమలకూ కావలసిన యంత్రములనూ యంత్రపరికరములనూ తయారుచేయుట-వగైరా వగైరాలు. కన్స్యూమర్ గుడ్స్ తయారియే, పెద్దెత్తునైతే భారీ పరిశ్రమలంటారు. చిన్నెత్తునైతే చిన్న పరిశ్రమలంటారు. భారపరిశ్రమకు భారీ పరిశ్రమకీ గుణింతంలేతేడా లాగ కనబడతాదిగాని, కాని ఆ రెండింటికి చాలా తేడావుంది.

అయితే ఆదేవన్నాడంటే —

భార పరిశ్రమలకు కోట్లకొలదీ పెట్టుబడి కావాలి కదా ? దేశంలో కోటీశ్వర్లు అందరి చింకి కోట్లూ పోగేసినా ఒక్క భార పరిశ్రమకూ సరిపోవు. ఫర్ లవ్ ఆర్ ఇంటరెస్ట్, ప్రజలపేర, ఒక దేశపు ప్రభుత్వం అట్టి పెద్ద పెట్టుబడులు పుట్టించడం ఈజీ. కాబట్టి భార పరిశ్రమల్ని ప్రభుత్వమే చేపట్టవలెనన్నాడు.

నిజమే. ఒక దేశంలో ప్రజ ఎంత పేదప్రజైనా, ఆ దేశంలో కోటీశ్వర్లువెంత గొప్ప కోటీశ్వర్లయినా పరపతి కాడి కొచ్చేసరికి ప్రజల్దే పరపతి.

ఆ సంగతి మనకి తెలీనీరు, కాని ఆఁకి బాగాతెలుసు. అందుకే భార పరిశ్రమలు మనం పెట్టగలమన్నాడు.

నీకూ నాకూ యీ లోగుట్టు తెలీకపోయినా, హ్యూమన్ కన్సిడరేషన్‌కే ఆడన్నది సబవనిపిస్తాది. అంతేకాదు. సోషలిష్టు కంట్రీసు ఎగ్జాంపులుకూడా కొంత ఉంది గదా !

కాని ఇంద్రజాలం ఎక్కడుందంటే—

తరవాత్తరవాత టేకప్ చేయదలచిన చిన్న పరిశ్రమలకోసం ముందుగా భార పరిశ్రమలు స్థాపిస్తాయి- ఏవి ? సోషలిష్టు కంట్రీసు అంటే ప్రజల సదుపాయంకోసవే ప్రజలు పెట్టుబడి పెడతారు- అక్కడ.

ఇక్కడో—లైట్ ఇండస్ట్రీస్, లార్జిస్కేల్ ఇండస్ట్రీస్, రెండు చిన్నా పెద్దా ప్రజల పెట్టుబళ్ళకు రిజర్వేషననీ సేవ. అళ్లు అలాగ పెరగాలన్నావు. ఆ పెరుగుదలకి ఆటంకం కారంగా-(పై దేశాలనుండే యంత్రాలూ, అవి చెడిపోతే ఆటికి పరికరాలు తెచ్చుకోడంలో కానా యిబ్బందులున్నాయ్) పబ్లిక్ సెక్టార్ భారీ పరిశ్రమలు టేకప్ చెయ్యాలంటావ్. ఆ పరిశ్రమలో పెద్ద పెద్ద పెట్టుబళ్ళు పెట్టాల ఆ చిక్కు ఒక్కటే కాదు. అతిజాగ్రత్తగా నడిపితేగాని లాభాల్రావు. నష్టం ఆరంబమయ్యిందంటే పూర్తిగా మసే.

అంటేఁవన్నమాటా? పుట్టబోయే పులిపిల్లల శ్రేయస్సు దృష్ట్యా పురిటికిముందే బలి సిద్ధం చేస్తున్నావన్నమాట.

నీ వంచనలో లోతూ, నీ విష వృక్షానికి నువ్వు తయారుచేస్తున్న పెద్ద సైజు పళ్ళెం, ఎతికితే ఇక్కడే ఈ స్టేజీలోనే కనిపిస్తాయి.

అయితే, భారపరిశ్రమలు ప్రొడక్షన్ ఆరంభించి ఏనాది ఏణ్ణర్థం గడిచిందాకా, ఆడి అసలు డిజైన్ ఏటో, అణ్ణ ఔననోళ్ళకీకాదు, కాదనోళ్ళకీకూడా అర్థంకాలేదు.

భార పరిశ్రమలతో పెట్టుబడి ఒక్కటేకాదు— తక్కిన చిక్కులుకూడా బోల్డన్ని ఉన్నాయన్నాను. అవేటంటే—

కన్స్యూమర్ గూడ్సు అమ్మకానికీ, ఇందాక అన్నానే ఇనుమూ ఉక్కూ... యంత్రాలు...అని— అలాంటి ఇండస్ట్రియల్ గుడ్సు అమ్మకాలకీ మార్కెటింగ్‌లో పెద్దతేడావుంది.

కన్స్యూమర్ గుడ్సు కొనీ జనం కోట్లమీద వుంటారు. ఆ గుడ్సు లేపోతే చాలామందికి రోజువారి జీవితం గడవదు. ఇప్పుడు బట్టలనగా సబ్బులనగా ఇలాంటి వన్నీ కన్స్యూమర్ గుడ్సు. ఇవికొనే జనం సంఘాలుగా ఏర్పళ్ళేరు. ఎవడికాడు అమాయకుడు. ప్రొడక్షన్ కాస్ట్, ఎక్స్ మిల్ రేట్, రిటైల్ ప్రైస్ అంటూ నువ్వెన్ని ముద్దర్లు ఎక్కడ గుద్దినా, ఆళ్ళకా గందరగోళం అర్థంకాదు.

కొట్టోడు దీం ధర ఇంతంటే ఇంతే కావోసనుకుంటారు. ధరలు పెరిగేయంటే పెరిగాయి, కావోసనుకుంటారు. ఎందుకు పెరిగాయి యెలా పెరిగాయని ఆలోచించరు. ఆలోచించలేరు.

భూమ్మీద చెట్టూపుట్టా చీమా దోమా మనిషీ మానూ యియన్నీ పుట్టిపెరగడం లేదా? అలాగే ధరలుకూడా ఒకెత్తుకు పుట్టి ఇంకో ఎత్తుకు పెరగడం సహజమే— అనుకునేవాళ్ళు లేరనుకోకు—ఉన్నారు. నే స్వయంగా ఎరుగుదును.

అంచేత కంస్యూమర్ గుడ్సు తయారుచేసే వోడిదీ, అమ్మేవోడిదీ, ఆడింది ఆట, పాడింది పాట.

మరి భార పరిశ్రమలు తయారుచేసేసరుకు అమ్మాలంటే అలాక్కాదే. వాడకందార్లు స్వదేశీయులుగాని విదేశీయులుగానీ పారిశ్రామికులు. అంటే లాభాలవేటల్లో ఆరితేరిన వీర పులులు. ఆళ్ళతో వ్యవహారాలకు దిగే మనుషులు ఆళ్ళకి అలివికానిజంతువలైతే తప్ప ఈజీగా ఆళ్ళని భక్షించేస్తారు.

మీకు జంగిల్ లైఫు గురించి తెలిసుండకపోవచ్చు. ఇప్పుడీ పులులా సింహాలూ సివంగులూ ఉన్నాయంటే అవన్నీ మన మేకలూ ఆవులూ లాగ బతకవు.

590

మనవన్నీ మంద జీవాలు. అవన్నీ బహు చలాగ్గా ఎప్పుడూ ఎలర్ట్‌గా వుంటాయి. అటికి అట్‌మోస్ ఫేమిలీయే యూనిట్. ఓక్క గుహలో కాపురంవుండే మెకాలు కూడా అల్లా మేటింగ్ టైమ్‌లో నా కేసు కోవొచ్చుగాని, మేతకాడ ఒకదాని పొడ ఇంకోదానికి కిట్టదు. తగువొచ్చి దెబ్బలాటకి లంకించుకున్నాయంటే అడవి దద్దరిల్లి పోవలసిందే.

ఫేమలీల్లోనే ఆటిపొత్తు యిలాగుంటే ఇతర క్రూరమృగాలతో వాటి సయోధ్య యెలాగుంటుందో ఆలోచించండి.

అయితే—

ఇంత ఒంటరి గొట్టు జీవాలూ వేటకాడికొచ్చేసరికి ఎలా అయిపోతాయో అన్నీ ఒక్కపాలి ఏకవైపోతాయి. అవి ఏ అడివి మృగాలేనా కావొచ్చు. ఏ జాతిమృగాలేనా కావచ్చు. జంతువుని ఏసీ దగ్గర ఆటిలో పోటీలేదు. అనుకోకుండానే అన్ని మెకాలు టీమైపోతాయి. వాణిజ్యవేత్తలూ పారిశ్రామికులూకూడా సరీగ్గా అంతే.

అప్పర్ క్లాస్‌కి చెందిన యీ ప్రముఖులు ఆర్గనైజ్ కావడానికి అనేక వేదిక లుంటాయి. అటిల్లో క్లబ్బులు ఓ రకం. నాలుగు డబ్బులు చేరిన ప్రతీవోడూ ఏదో ఓ క్లబ్బులో మెంబరై వుంటాడు. రోటరీలనీ, సింహాలక్లబ్బులని మళ్లా అందులోతేడాలు.

ఇప్పుడు సింహాల క్లబ్బు సభ్యులున్నారంటే, ఆళ్ళ దందరిదీ ఓ ఫ్రాటర్నిటీ. ప్రతి చిన్న పట్నంలోనూ (ఈమధ్య బస్తీల్లోకూడా) యీళ్ళకో క్లబ్బుంటాది. ఊరికో ప్రెసిడెంటూ. జోనుకో చేర్మేను, జిల్లాకో గవర్నరూ— జిల్లాలంటే మన జిల్లాలుకావు ఆళ్ళ సరిహద్దులు వేరు, రెండేసి మూడేసి స్టేట్లు ఓ జిల్లా— ఇలాగ ఒకదానికొకటి లింకుచేసుకుంటూ మొత్తం ఇదోవరల్డ్‌వైడ్ ఆర్గనేజషనట. మన ఇండియన్ లైను హుడ్ ఆ చైన్లో ఓ లింకు.

ఈ లింకుకో నాయకుడుంటాడు. మొత్తం నెట్‌వర్క్కి పెద్ద'లైన్సు ఇంటర్ నేషల్ ప్రెసిడెంట్'— ఆడు ఏ అమెరికాలోనో వుంటాడు. ఆడు నూటనలభై తొమ్మిది దేశాల్లో మూడువందలఇరవై జిల్లాలకు అధిపతట.

అలాగే రొటారియన్లు.

పేరుకివి ప్యూర్లీ. సోషల్ సర్వీస్ ఆర్గనేజషన్‌లు. 'సర్వీస్ ఎబౌ సెల్ఫ్'ఆళ్ళ 'మాటో'. ప్రపంచదేశాల పెద్దల్తో చేతులు కలిపి బడుగుదేశాల పెద్దలుచేసే నేషనల్ సర్వీసు ఏటో మీ రూహించుకోవొచ్చు.

ఇలాంటి వెల్ అండ్ వైడ్‌లీ ఆర్గనైజ్‌డ్, కేలిక్యులేటింగ్‌లీ ఇంటల్‌జెంట్, రూత్‌లెస్ అండ్ గ్రీడీ పీపుల్ ఓ వక్క—

ఆళ్లు ప్రజల డబ్బుతో పబ్లిక్ సెక్టారులో తయారయే హెవీ ఇండస్ట్రీస్ ప్రొడక్ట్సుకి కొనుగోలుదార్లు. ఈకొనుగోలుదార్లతో, ఆళ్ల కొనుగోలుదార్లు జనసామాన్యాన్ని సరిపోల్చండి.

ఇంక ఈళ్ళ కెదురుగా అమ్మకందార్లెవరూ—

సొమ్మొకడదీ సోకొకడదీ అని సా(వెతుందిసూడండీ— అలాగ ప్రజలసొమ్ముకి ట్రస్టీలు ప్రభుత్వంవారు పెట్టుబడిదార్లయితే— వారి లాభనష్టాల్తో ప్రమేయంలేని పెద్ద పెద్ద జీతాలూ ఆనరోరియమ్‌లూ లాగే నిపుణులు వ్యాపారాల్ని నడిపిస్తారు.

ఈళ్లు పెంచుకునే ఆస్తులకి సీలింగుల్లేవు. అడిగినా లెక్కలప్పజెప్పవలసిన బాధ్యత, ఆళ్ళకి ఉంటాదిగాని తీసుకోరు. ఈ జనం సాధారణంగా అప్పర్ క్లాస్ అయ్యుంటారు. లేప్పోతే అలాటి క్లాసు జీవితంకోసం తహతహలాడే అధమవర్గాలేనా కావచ్చు.

ఎవ శేనా— ఇలాటి ఈ ధర్మకర్తలే రెండోపక్క ఈళ్లూ— ఆ పులుల్తో బేరాలాడ్డం.

ఇంకమరి. ఆ బేరా లెలాగుంటాయో, బేరసారాల్లో పట్టువిడుపులు ఏ ఇంటరెస్టుతో సాగుతాయో, అసలు-ఆళ్ళకీ యీళ్ళకీ ఎలాటి మేచో, ఇందులో ఎవరు నెగ్గగలరో, ఎవరు నెగ్గినా కొసకొచ్చేసరికి లాభాలెవరివో— అవన్నీ మీరే ఊహించుకోండి.

ఏ(వీ లేనప్పుడే లాభాల వేటగాళ్ళని పట్టలే(వు, పొజిషన్‌కూడా ఎడ్వాంటేజస్ పొజిషన్ దొరికితే, యింక చెప్పాలా? యిలాగ... ఇలాగ తోకలు అతి జాయిగా ఎత్తిఊంచుతూ, ఆపర్చ్యూన్ టైమ్‌కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వంవారు ఇక్కడ బరికీ అక్కడ బరికీ అడ్డ(మైన దేశాలకాడా అప్పులేసి ఇంకా చాలక మళ్ళాముష్టెత్తి ఎలాగైతేనేం రెండోప్లాను పూర్తిచేసేరు. భారపరిశ్రమలు ప్రొడక్షన్ ఆరంభించేయి.

ఆరంభించిన తరవాత, అవలాగ సాగుతునే ఉన్నాయి.

ఏడాది గడిచింది. ఏణ్ణర్థం గడిచింది. ఓపక్కనుండి తయారైన గుడ్సు డమ్పైపోతున్నాయి.

దొంగలంతా కూడబలుక్కున్నట్టు, దేశవాళీ పారిశ్రామిక బృందంలో, ఒక్కడూ మాటాడడు.

పోనీ ఫారిన్ మార్కెట్లకి తరలిద్దా(వంటే, మనకి మార్కెట్లులేవు. 'ఉన్న ఆ ఒక్క కామన్వెల్తుమార్కెట్లోనూ, మన గుడ్సుకి డిమాండ్‌లేదు. ఎన్నాళ్ళనుండో

592

ఇండిస్ట్రీల్లో పాతుకుపోయిన దేశాలు— బ్రిటననగా, కెనడా అనగా— ఇలాంటి దేశాల్తో మనం పోటీపడగలఁవా? పడలేఁవు — పడలేప్పోయేఁవు.

అప్పుడు దేశంలో పెట్టుబడి పెట్టగలోళ్ళనే పిలిపించి మాటాడితే, ఆళ్ళేటన్నారూ-

ఆళ్ళు మా దగ్గిర పెట్టుబడి లేదన్నారు. ఉన్నా మీరేదో సోషలిజమూ, గీష లిజమూ గట్రా మాటాడుతున్నారు: అలాటి పరిస్థితుల్లో 'చీఁవూ నెత్తురూ?'గా కూడేసిన డబ్బులు, మా డబ్బులు పెట్టుబడిగా పెడితే ఆ తరవాత మీరు ఆ పరిశ్రిమల్ని జాతీయం చేసేస్తే అప్పుడు మాగతేం కావాలన్నారు?

ఏఁవవుతుంది—కాంపెన్సేషన్ ఇస్తాంకదా అన్నారు.

అంటే ఏదో ముతక సాఁవెత చెప్పినట్టు, మీరిచ్చే కాంపెన్సేషన్ మా ఎలక్ట్రిక్ బిల్లులకే సాల్దు పొమ్మనీసేరు.

మా పల్లెటూళ్ళలో తగువుకి బయల్దేరితే 'చిక్కింతగువా చిక్కింతగువా?' అనడుగుతారు. చిక్కింతగువంటే అవతలోడి పిలక నీచేతిలో ఉందన్నమాట. అలాగ ఆళ్లకీది చిక్కింతగువు. అంచేత ఎంత నీలుగుడన్నా నీలుగుతారు.

ఎప్పుడైతే ప్రిభుత్వం పొజీషను ఇరకాటంలోపడిందో, పడి, గాడిదల్తో కాళ్ళ బేరానికి దిగిందో, అప్పుడా సంగతి పెట్టుబడిదార్ల మనుషులికి తెలిసిపోయింది. తెలిసి ఆళ్లు నాలుగు మూలల్నుండీ ఒక్కపాలి కమ్ముకున్నారు.

ఇటు పార్లమెంటులో ప్రశ్నలమీద ప్రశ్నలదాడి. అటు పబ్లిక్‌లో పత్రికల్ద్వారా అలజడి— ఓ, ఒగ్గొడవా?

ప్రెస్సంటే గుర్తుకొచ్చింది. ప్రెస్సు గురించి మీకో చిన్న ఇన్ఫర్మేషన్. ప్రెస్సెలాటిదంటే—

ప్రజాతంత్రాల పేర నడిచే కుతంత్రాల్లో, తెరవెనక పాలకులేచ్చేతి అతి పెద్ద సాధనం, ప్రెస్సన్నాడు— ఓ పొలిటికల్ ఫిలాసఫర్.

దాని సాయంతో ఆళ్ళు ప్రభుత్వాలను ఠక్కుమీది కెక్కించడం; అక్కణ్ణుండి దింపీడఁవేకాదు. పనికొస్తాడు పైకెత్తాలీ అంటే, మశికాల్లాటి పీనుగుల్ని పట్టుకొని మహాగజాల స్థాయికి పెంచీగల్రు. పెంచి ఎదురు తిరిగినా పనికిరాప్పోయినా, ఆ మహా గజాల్ని, మళ్లా మశికాల సైజుకి గట్ చేసీగల్రు.

అందుకే ఎంతెంత కొమ్ములుత్తిరిగిన నాయకులేనా రాజకీయ రంగంలో ఎంతటి అసహాయ శూరులైనా, పత్రికాధిపతుల్దగ్గిరికొచ్చీసరికి మర్యాదగా చాలా జాగ్రిత్తగా వ్యవహరిస్తారు. ప్రెస్ బ్రీఫింగ్ మిషతో ఆళ్ళ చెవి నెయ్యందే ఇదమిద్ధఁవని ఏ పెద్ద విషయంలోనూ నిర్ణయానికిరారు. ఇది జనరల్‌గా అన్ని దేశాల్లోనూ జరిగేసంగతే.

ఈ దేశంలోకూడా మూడొంతుల ముప్పాతిక ప్రెస్ తెరవెనక పెదనాయకుల్దే. ప్లాను ప్రివేశపెట్టే ముందు వారూ వీరూ, మరి ఏం అండర్‌స్టాండింగ్‌కొచ్చేరో తెలీదు.

దాదాపు అన్ని పత్రికలూ ప్లాననీ ప్లానింగ్ విధానాన్నీ సపోర్ట్‌చేస్తునే వచ్చేయి. ఇప్పుడు ప్లానింగ్‌లో ఏదో కసింత తిరకాసు జరిగినట్టూ, అది కొన్ని వర్గాలవారిలో కొందరికి లాభించబోతున్నట్టూ సూచాయిగా తెలిసింది. తెలీడఁవే తడవు—

పబ్లిక్ సెక్టార్‌మీదా ప్లానింగ్‌మీదా శీర్షికలెత్తిరిచేసి, దానికి రంగాలు రెడీ అన్నారు.

మరి ఆపని చెయ్యేవా! — ఒక అప్రెషన్‌కాదో ఓ సప్రెషన్‌కాదో అయితే గవెన్మెంటుతో మొగమాటం. రియల్ మేటర్సు—డబ్బూ పవరూ ఇన్వాల్వై వ్వనచోటా, ఆళ్ళ యజమాన్ల ఇంటరెస్టులు స్టేకులో ఉంచేనూ, ఆళ్ళూరుకుంటారా? ఊరుకుంటే యజమాన్లు ఆళ్ళని బతకనిస్తారా?

అయితే యీ సంగతి గవన్మెంటుకీ తెలుసు. అంతేకదు ఆళ్ళ గేమేటో— అదికూడా తెలుసు. తెలిసిమాత్రం ఏం చేస్తారూ— ఏఁవీ చెయ్యలేనిస్థితిలో పడ్డారు.

ప్రజారంగంలో పరిశ్రిమలు బతకలేవు— అని బోల్డుగా ఒప్పేసుకుంటారా? ఒప్పేసుకుంటే జనం నెత్తిమీద యీకలుంచరు.

సరే యీకలుంటే ఉంటాయి. పోతే పోతాయి. అలాఅని ఒప్పేసుకుంటారు. ఒప్పేసుకున్నాక?

పెట్టిన పరిశ్రిమలు అప్పగిస్తే, భరించడానికి గుత్తపెట్టుబడిదార్లు ఒక్కళ్లే సమర్ధులూ— అదీ ఫారిన్ కొలాబరేషన్‌తో. ఆళ్ళూ యీళ్ళూకూడా అందుకు రడీయే. పేపర్లలో ఆ హడావుడంతా దేనికి మరి! అలా అని ఆళ్ళ కప్పగిస్తే, ఈ దేశాన్ని మరింకో అరబ్‌కంట్రీ చేసీడానికి చిన్న పెట్టుబడిదార్లు జంకరు.

ఎవరికీ అప్పగించకుండా వెనకట్లాగే నడిపేద్దాఁవంటే మార్కెట్‌లేని ప్రొడక్షన్ ఎంతకాలం సాగించడం?

తాత్కాలికంగా మూసేద్దాఁవన్నా—

కోట్లకొద్దీ పెట్టిన పెట్టుబడి, అదీ అప్పుచేసొండిన పప్పుకూడు. దేశంలో జనాలూరుకున్నా అప్పులిచ్చిన జనాలు ఊరుకోరే!

ఆళ్ళనీ ఊరుకో బెడతాం.

ఆళ్లూరుకున్నా—

అంత కాలం ఆటిమీద బతుకుతున్న వర్కర్లూరుకోరు. నేచురల్ కోర్సులో అనెంప్లాయిమెంట్ ఎన్ని రెట్లు పెరిగినా అదో సంగతి. ఫరవాలేదు. చిన్నవో పెద్దవో జీతాలకలవాటుపడ్డ ప్రాణులు— ఈ వర్కర్లు. ఆళ్ళనిప్పుడు టీ నీళ్ళక్కూడా టికాణా లేనిస్థితికి డీప్రమోషనంటే ప్రమాదం కాదా? ఆ భూతగణాలు లక్కిన భూతజాతినంతా నిద్రలేపుకొస్తాయి. మరికోసారి ఈ జంబూద్వీపస్థభరతఖండంలో దక్షవాటికా నాటకం పునః ప్రదర్శితమౌతుంది.

ఎందుకొచ్చిన దొంకతిరుగుళ్ళు— ఆ చిన్న పరిశ్రమలేవో ప్రభుత్వమే నడిపితే సరిపోదా? అన్న సలహాలుకూడా వచ్చేయి. నడవొచ్చు. చిన్నవాటికైనా కొంత పెట్టుబడి ఉండాలికదా? ఉన్న నేషనల్ రిసోర్సెస్సన్నీ పబ్లిక్ సెక్టారుకే ఖర్చయిపోయేయి అసలు ట్రెచరీయే అక్కడుంది. దెయ్యాలకే పిండి చాలని స్థితిలో నిన్ను వదేస్తే దెయ్యప్పిల్లలెలాగా నీ పీక పిసికేస్తాయి— మొత్తం ప్లాన్లో ట్రిక్కే అది.

అంచేత అప్పుడు— అన్ని దర్వాజాలూ మూసుకుపోయిన ప్రభుత్వంవారు-- విజార్డ్ ఆఫ్ ద సౌతిండియా చాంబరాఫ్ కామర్సువారు తెరిచుంచిన గేటు దగ్గిరికే వచ్చేసేరు. వచ్చేసి—

మదుపుకి డబ్బులాచ్చలవన్నోళ్ళకి బ్యాంకులచేత అప్పులిప్పించి, ఇండియన్‌గుడ్సు కాస్టిలీ అంటే మిషీన్లమీద సబ్సిడీలిచ్చి, అదక్కా ముందే ఫారిన్ కాంపిటీషన్నించి ప్రొటెక్షనిచ్చి, అడిగినట్టూ, అల్లరిచేసినట్టూ రూపించి కొన్ని కొన్ని టాక్సుల్నుండి ఎగ్జంప్షనిచ్చి ప్రభుత్వమే కొంతమంది బీద పారిశ్రామికుల్ని బతిమాలి నిలబెట్టవలసొచ్చింది.

ఆళ్ళు ఆవిధంగా బలవంతాన పరిశ్రమల్లోకిదిగి, కొంతమంది కోటీశ్వరులయ్యేరు, మరికొంతమంది పెద్ద కోటీశ్వర్లకి లైసెన్సులమ్మి పిల్లకోటీశ్వర్లయ్యారు. ఇంకా కొందరు కన్వీనియంట్‌గా దివాలాత్తీసేరు.

కుట్రించే అదీ కుట్రి—

అటు ఐదువందల అరవై ఆరు పెద్ద పెద్ద సంస్థానాల్ని ఏంవీ కానట్టు యూనియన్‌లో కలిపేసుకున్నారు. దేశంలో చిన్నాపెద్దా జమీందారీలన్నీ ఎబాలిష్‌చేసేశారు. ఇనాంలు సరేసరి; మన పనేంచౌతాదో, ఈ ప్రభుత్వం మన్నేం ముంచేస్తాదో అని కోటీశ్వర్లు గుబగుబలాడిపోతున్న రోజుల్లో—

మరేం ఫరవాలేదని—

ఆ ప్రభుత్వంచేత బంగారు బాతుగుడ్లకథ త్రినాథ వ్రతకల్పంలాగ మననం చేయించి, ఆళ్ళ కోళ్ళ యీసటోయే గుడ్లమీద ఆశచూపించి నేషనల్ రెసోర్సెస్ ఎటుపోతాయి, ముందు బైటనుండి కొట్టుకురండని, అప్పుచేసి తెచ్చిన ఆ డబ్బులో మేజర్ పార్టు చెత్తా చెదారం ప్రోజక్టులమీద ఖర్చు చేయించి, చాలీ చాలని డబ్బుతో మేజర్ ప్రోజక్టుల్లోకిదించి, లోటు బడ్జెట్ విధానంకూడా ఓ ఎకానమీయే— అని ఆ ఘోరంలో కక్కాసా దించి, మొత్తం యీ ప్రోసెస అంటట్లో అటు బురాక్రసీని ఇటు పవర్లోఉన్న పెద్దల్ని కరప్టుచేసి, ఆ ద్వారా నీతికి నిలబడదలచిన నాయకుల్ని నిరాశ్రయుల్ని చేసేసి ఇన్‌ఫ్లేషన్, సోరింగ్ ప్రైసెస్, డివేల్యూయేషన్, వంటి అరాచకస్థితిరాగా—నీవేతప్ప ఇతఃపరంబెరుగ అంటూ—

త్రాహి త్రాహి అంటూ —

ఆ కోటీశ్వర్ల కాళ్ళమీదే -

595

ఆ అంతలావు ప్రభుత్వమూ—

వాలేటట్టు చెయ్యటం అంటే మాటలేటి — మామ్మూలు పద్ధతుల్లో జరిగేదా?

ఏదో కుట్రేనా అయ్యుండాల— లేపోతే మనం నమ్ముకున్న నాయకులు దొంగల్తో షరీకేనా అయ్యుండాల.

దేశానికి 'మణిద్వీపం' జవహర్లాల్ నెహ్రూ ఏఁవన్నాడు! నేనింతా జనంకోసం నా ప్లాన్లన్నీ ఏయిస్తే కోటీశ్వర్లు మరీ కోటీశ్వరులై పేదవాళ్ళు ఇంకా పేదవాళ్లయి పోయేరన్నాడు. ఎలాగ? కళ్ళనీళ్లు తిరుగుతుంటే—

ఆయన అబద్ధఁవాడతాడా? లోపాయికారీ సంగతులన్నీ మనకి తెలిపోవచ్చు. ఆయనకి తెలీవా? లేపోతే ఆయనగారివి మొసలి కన్నీళ్లు అందాఁవా?

అంచేత ఈ ప్రోసెస్‌లో ఎక్కడో ఏదో కుట్ర జరిగిందన్నది ఖాయం. నా ఇన్ఫర్మేషన్ తప్పుకావచ్చు. నా ఇన్ఫరెన్సు మాత్రం తప్పు కాదన్డానికి నాకు నెహ్రూ వాక్యాలే సాక్ష్యం.

అలాగ కోట్లకొద్దీ జనాల్ని దగాచేసీసి, నోర్లేని ఆ జనం కరువూ, కాటకాలూ, నిరుద్యోగంతో మాడుతుంటే ఉన్న కోట్లుచాలక, ఇంకా ఇంకా, కోట్లమీద కోట్లు, కూడేసీవాళ్ళందరూ క్షేమంగానే ఉన్నారు.

ఎంచేతా? వాళ్ళుచేసే ఘోరాలన్నీ లాఫుల్‌గానే జరుగుతుండి ఉండాల.

లేపోతే అతివాదుల్నో ఉగ్రవాదుల్నో మరికోళ్ళనో, యింకోళ్ళనో అర్ధాన పుటడవుల్లో వేటాడిన ప్రభుత్వం, ఏం-పదిమందిమధ్యే వున్నారు, ఈ పాపిష్టి జనాన్ని వేటాడ లేదేటి?

అంటే ఆ 'లా' తప్పన్నమాట. కాన్స్టిట్యూషన్ ఆళ్ళకి అలాటి అవకాశాలిస్తే ఆ కాన్స్టిట్యూషన్‌కూడా దుష్టఁవైనదేనన్నమాట.

అది మారాలన్నారు కొందరు. అది మారాలంటే మీరు మారనీరు. మిమ్మల్ని మార్చబోతే మార్చబోయినవాళ్ళని దేశద్రోహులంటారు.

మా లాయర్ ఫ్రెండ్ ఒకాయన చెప్పినట్టు — దేశద్రోహఁవంటే నమ్మిన జనసామాన్యాన్ని నాయకులో పవర్లో ఉన్న పార్టీయో, పార్టీల్లో మనుషులో దగాచేస్తే— అది దేశద్రోహఁవా అల్లైవరేనాకానీ— ఆ చేసేదగాని బైటపెట్టడం, ఎదుర్కోమనడం, ఎదుర్కోవడం— ఇవా దేశద్రోహం?

ప్రెస్సూ ప్లాట్‌ఫాంచేతిలో ఉంటే ఎన్ని బుకాయింపులేనా బుకాయించొచ్చు. కాని నిజం ఎప్పటికీ నిజమే. గాంధీగారి కోతులు కళ్ళూ చెవులూ నోరూ మూసీసుకోవాలని మూసీసుకోండని చెప్పి—ఇంకా ఇనపోతే, బలవంతాన మూసీడానికి ప్రయత్నించొచ్చు. కాని—???